క్లుప్తంగా

ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేయాలి



మాట్లాడుతున్న ఎన్‌సీడీ-సీడీ ప్రోగ్రాం ఆఫీసర్

గోనెగండ్ల : అసంక్రమిత వ్యాధులైన రొమ్ము, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షల కోసం వైద్య సిబ్బంది పకడ్బందీగా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయాలని ఎన్‌సీడీ-సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.శైలేష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఎన్‌సీడీ-సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతిపై వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, ఆరోగ్య పరీక్షలు చేసి క్యాన్సర్ వ్యాధి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రంగరవళి, కార్తీక్, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, సీహెచ్ఓలు, ఎంపీహెచ్ఈఓలు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ దేవర

గోనెగండ్ల : మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామంలో శ్రీ సుంకులమ్మ అవ్వ దేవరను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సుంకులమ్మ అమ్మకు కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు పూర్ణకుంభాలతో తప్పెట్లు, మేళతాళతో ఆయా దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

హాస్టల్ విద్యార్థికి ప్రతిభా పురస్కారం



రాఘవేంద్ర

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని మండలం నాగనహల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర పట్టణంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో వుండి స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్ మెంట్ కోర్స్‌లో 958 మార్కులు సాధించాడు. దీంతో మంగళవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డును అందుకున్నాడు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన తనను తల్లి ఆసనమ్మ కూలీ పనులకు వెళ్లి చదివించింది. కుటుంబానికి అండగా నిలవాలనే తలంపుతో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించానని, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్స్ చేసి ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆదోని రూరల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ మైదానంలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. సచిన్‌లెవెన్ జట్టు మొదటి స్థానం, లెవెల్‌స్టార్ జట్టు రెండో స్థానంలో నిలిచాయి. వీరికి వై.పి. కృష్ణమోహన్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ముజీ బొమ్మది, ఆర్గనైజర్లు యాసీన్‌బాషా, జైభీమ్ సాయిరామ్, బసవరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన ప్రభుత్వం

ఆదోని రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 134 జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించకుండా కూటమి ప్రభుత్వం అవమానపరిచిందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది, కేవీపీఎస్ నాయకులు తిక్కప్ప అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో వారు మాట్లాడారు. 30 సంవత్సరాల నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వమే ఘనంగా నిర్వహించేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ములుగుందం సర్పంచ్ భర్త యేసోబు, రాజు, బసాపురం ఈరన్న, వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆదోని రూరల్: పట్టణంలోని అజాత అగ్రిటెక్, రత్న అగ్రిటెక్‌లో పత్తి విత్తన, ఎరువుల దుకాణాలను మంగళవారం గుంటూరు ఏడీఏ కల్యాణ్‌కుమార్, వ్యవసాయ అధికారి కె.లక్ష్మిరెడ్డి తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లోని పత్తి విత్తనాలకు హెర్బిసైడ్ టోలరెన్స్, హెచ్‌టీ టెస్ట్ నిర్వహించేందుకు ల్యాబ్‌కు పంపుతామన్నారు. తనిఖీల్లో ఆదోని ఏడీఏ బలవర్ధిరాజు, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

ఆదోని రూరల్: ఈనెల 19వ తేదీన ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్. ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. జాబ్‌మేళాకు 13 కంపెనీలు, 710 ఉద్యోగ ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. వివరాలకు 91774 13642, 97039 93995 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

నిబంధనలకు పాతర..

అడ్మిషన్ల వేట

'సార్..సార్ ఇంటర్మీడియెట్ ఫలితాల్లో టౌన్ టాపర్లు మా జూనియర్ కళాశాల విద్యార్థులే... మా కళాశాలలో మీ పిల్లలను చేర్పించండి అలాంటి ఫలితాలే వస్తాయి'.. అంటూ తల్లిదండ్రులతో ఓ కళాశాల అధ్యాపకులు. 'మేము ఓ ప్రైవేట్ కళాశాల నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ అబ్బాయి, అమ్మాయిని మా కాలేజీలో చేర్పించండి, మీరు ఇప్పుడే పేరు రిజిస్టర్ చేయించుకుంటే ఫీజులో 20శాతం రాయితీ ఇస్తాం.' ఇంతలో మరో కాలేజీ నుంచి ఫోన్.. 'సార్ మావద్ద అన్ని వసతులున్నాయి, రూ.2వేలు కట్టి మీపేరు నమోదు చేసుకుంటే సీటు రిజర్వ్ చేసిపెడతాం.. లేకపోతే సీటు దొరకడం కష్టం. మీరు ఓకే అంటే మాసిబ్బంది మీవద్దకే వచ్చి వివరాలు చెబుతారు'.. అంటూ వివిధ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల నుంచి ఫోన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను వలలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలావుంటే ఇళ్ల వద్దకే ఆయా కళాశాల సిబ్బంది వచ్చి 'సార్ మీపిల్లల భవిష్యత్‌ను మంచిగా తీర్చిదిద్దుతాం.. ఫీజులు తగ్గిస్తాం' అంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు.

- పది ఫలితాలు విడుదల కాకుండానే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల అడ్మిషన్ల గోల
- ప్రభుత్వ కళాశాలల్లోనూ అడ్మిషన్లు ప్రారంభించడంతో అడ్డూ అదుపూ లేకుండా ప్రచారం
- అధ్యాపకులకు అడ్మిషన్ల టార్గెట్లు
- అయోమయానికి గురవుతున్న తల్లిదండ్రులు

ఎమ్మిగనూరుటౌన్: గత నెల మార్చి 17నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. ఎమ్మిగనూరులో 2,600 మంది, గోనెగండ్లలో 627 మంది, నందవరంలో 394 మంది పరీక్షలు రాశారు. ఇంకా ఫలితాలు కూడా విడుదల కాలేదు. ఓవైపు ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వమే పది ఫలితాలు విడుదల చేయక ముందే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలను ఈనెల 7వ తేదీ నుంచే ప్రారంభించడంతో ఇక కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో పట్టణంలోని ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల కోసం వేట సాగిస్తున్నాయి. పోటీ తీవ్రంగా వుండటంతో కళాశాలల యాజమాన్యాలు సిబ్బందిపై ఒత్తిడి పెంచి మరీ టార్గెట్లు ఇస్తూ విద్యార్థులను కళాశాలల్లో చేర్పించే బాధ్యతను అప్పజెబుతున్నారు. దీంతో ఉద్యోగ భద్రత లేని వారు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో వారు విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తూ ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ ర్యాంక్‌లు, ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎంపికయ్యే స్థాయిలో మా విద్యాబోధన వుంటుందంటూ చెప్పుకొస్తూ అడ్మిషన్లు చేయిస్తుండటం గమనార్హం.

అధ్యాపకుల అష్టకష్టాలు

నియోజవర్గంలో పదో తరగతి చదివిన విద్యార్థుల జాబితాను సేకరించుకొని కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లను అడ్వాన్స్ బుక్ చేసుకుంటున్న వైనం విస్తుగొలుపుతోంది. ఇదిలా ఉండగా నిబంధనల ప్రకారం కనీస మౌలిక సదుపాయాలు, క్రీడామైదానాలు, తరగతి గదులతో పాటు విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించని కళాశాలలు ఎలాంటి ప్రచారాలు చేయరాదు. కాని పలు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి అయోమయానికి గురిచేస్తున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆయా సంస్థల యాజమాన్యాలు చెప్పినట్లు అడ్మిషన్ల కోసం సిబ్బంది పడుతున్న కష్టాలు వర్ణతీతం.



అడ్మిషన్ల కోసం ఎండలో తిరుగుతున్న ఓ కార్పొరేట్ విద్యాసంస్థ సిబ్బంది

కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు అరికట్టాలి



ఆశలు రేపే ప్రకటనలు, ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీకొట్టించే ఆయా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలు అరికట్టాలి. ఆకోర్స్,, ఈకోర్స్ అని, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మభ్యపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. కళాశాలల్లో చేర్చే వరకు ఒక మాట..చేర్చిన తరువాత మరోమాట చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ప్రకటలు, ప్రచారాలు చేయకుండా ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలను అదుపుచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

– వీరేష్‌యాదవ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

నేడు మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం



సబ్‌కలెక్టర్‌కు విప్ పేపర్లను అందజేస్తున్న కౌన్సిలర్ బాలాజీ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లకు బుధవారం ఉదయం 10:30 గంటలకు ప్రెసిడింగ్ ఆఫీసరుచే ప్రత్యేక సమావేశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ మంగళవారం తెలిపారు. ప్రతి వార్డు కౌన్సిలర్ మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన గుర్తింపు కార్డుతో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలన్నారు. వార్డు కౌన్సిల్ సభ్యులు కేవలం గేటు–1 ద్వారానే లోపలికి రావాలని, మరెవరికీ ప్రవేశం లేదన్నారు. వాహనాలను మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ ప్రాంగణంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల విప్ జారీ

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు కౌన్సిలర్ వై.జి. బాలాజీ విప్ జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం విప్ పేపర్లను సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలాజీ, సందీప్‌రెడ్డి, ఫయాజ్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా మంటలను ఆర్పివేయాలో చూపుతున్న సిబ్బంది



ఎమ్మిగనూరు శివసర్కిల్‌లో అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన

ఆదోని అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని కూడళ్లల్లో ఆర్టీసీ బస్టాండు, తిమ్మారెడ్డి బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు మార్గాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు కరపత్రాలను అందజేశారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండు, తిమ్మారెడ్డి బస్టాండులలో ఉన్న ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పివేయాలో డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో సిబ్బంది సందీప్‌కుమార్, హనీఫ్, మల్లికార్జునరెడ్డి, చిదంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మిగనూరుటౌన్: ప్రజలు అప్రమత్తంగా వుంటే అగ్నిప్రమాదాలను వెంటనే నివారించే అవకాశం వుందని స్థానిక ఫైర్ ఆఫీసర్ రామాంజినేయులు అన్నారు. అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, శివ సర్కిల్ తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలను అదుపులోకి తెచ్చే విధానాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా అగ్నిప్రమాదాలు, ముందుగా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అగ్నిమాపక శాఖ ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టి వివరించారు.

నిర్మలకు సత్కారం



విద్యార్థిని నిర్మలను సన్మానిస్తున్న జేసీ, సబ్‌కలెక్టర్, కురువ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్

ఆదోని రూరల్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ బోర్డు పరీక్షల్లో కర్నూలు జిల్లా టాపర్‌గా నిలిచిన పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఎస్.నిర్మలను మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొని విద్యార్థిని నిర్మలకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఆస్పరిలోని కేజీబీవీ కళాశాలలో బైపీసీ చదివిన నిర్మల మొదటి సంవత్సరం 421 మార్కులు, రెండో సంవత్సరం 966 మార్కులు సాధించి జిల్లాలో బైపీసీ విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించిందన్నారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని నిర్మల వంటి విద్యార్థులు భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. నిర్మల చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ ఐపీఎస్ అధికారి కావడమే తన లక్ష్యమని, ఆ దిశగా ముందుకెళ్తానని చెప్పారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు షేకున్‌బాను, ఎంఈఓటీసీ డాక్టర్ వినోద్‌కుమార్, అనిల్‌సాగర్, రేణుశ్రీ, ఎంపీహెచ్ఎస్‌జీ బాబురాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని అరుంధతినగర్ యూపీహెచ్‌సీ, హనుమాన్‌నగర్ యూపీహెచ్‌సీ, షరీఫ్ బజార్‌లోని యూపీహెచ్‌సీలో ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ సిబ్బంది లలితమ్మ, సుబ్బమ్మబాయి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మతోన్మాదంపై పోరాటమే జార్జిరెడ్డికి నివాళి

ఆదోని సెంట్రల్/ఆదోని రూరల్: మతోన్మాద వ్యతిరేక పోరాటమే జార్జిరెడ్డికి నిజమైన నివాళి అని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. మంగళవారం ఆదోనిలో జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రసూల్, శ్రీను, సిద్దార్థ్, సిద్దయ్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలను పూర్తి చేయాలి

ఆదోనిసెంట్రల్: ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదోనిలో అర్ధంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు వేతనం అందుతుందన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో మంచినీరు, షెడ్లు, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు కోరారు. మంగళవారం మండలంలోని పాండవగల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. నేల గట్టిగా ఉండడంతో బిందెలతో నీరు మోసుకుని తెచ్చి పనిచేస్తున్నారన్నారు. సులభతరమైన పనులను కూలీలకు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రేషన్ కార్డు ఈ–కేవైసీ చేసుకోవాలి

ఆదోని రూరల్: మండలంలోని రేషన్‌కార్డు సభ్యులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆదోని తహసీల్దార్ శివరాముడు అన్నారు. కొంతమంది ఇప్పటికే ఈ–కేవైసీ పూర్తి చేసుకున్నప్పటికీ మిగిలిన లబ్ధిదారులు ఏప్రిల్ 30వ తేదీలోపు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈకేవైసీ ప్రక్రియను వీఆర్వోలు, ఎఫ్‌పీ షాప్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పూర్తి చేసుకోవచ్చన్నారు .

ఆబాదీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

గోనెగండ్ల: త్వరలో చేపట్టే స్వమిత్ర ఆబాదీ సర్వేను పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పకడ్బందీగా చేపట్టాలని ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్ సూచించారు. మంగళవారం ఆమె గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఇంటి, కుళాయి పన్నులు ఎంత వరకు వసూలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మే, జూన్ నెలలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టే స్వమిత్ర ఆబాదీ సర్వేపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్, హైమవతి, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతలకు బాధ ఎందుకో?

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రశ్న
- చైర్ పర్సన్‌తో సహా 41 కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీవారే
- బీజేపీకి ఒక్క కౌన్సిలర్ కూడా లేరు
- మున్సిపల్ చైర్‌పర్సన్ పనితీరు సరిగా లేకపోవడంతోనే అవిశ్వాస తీర్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ పాలకవర్గం వైఎస్సార్‌సీపీదే, చైర్‌పర్సన్, 41 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. అయితే చైర్‌పర్సన్ పనితీరు సరిగాలేకపోవడంతో అవిశ్వాసతీర్మానం పెడితే బీజేపీ నేతలకు ఎందుకో బాధ అని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ప్రశ్నించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ తరపున ఒకరు గెలిచారని, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు 41 మంది ఉన్నారని, మొత్తం 42 మంది కౌన్సిలర్లు కాగా, బీజేపీ తరపున ఒక్క కౌన్సిలర్ కూడా లేరని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పాలకవర్గ సభ్యుల సమస్యలను చైర్‌పర్సన్ పెడచెవిన పెడుతున్నారనే కారణంచేత అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగిందన్నారు. అయితే బీజేపీ నేతలు పోలీసుల చేత వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు, కొంతమంది నాయకులు, కార్యకర్తలపై ఒత్తిళ్లు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఐదుగురు కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని, అందులో 11వ వార్డు కౌన్సిలర్ తిరిగి సొంతగూటికి చేరుకున్నారన్నారు. మరో ఇద్దరు త్వరలోనే రానున్నారని సాయిప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఆదోనికి రూ.4 కోట్లు మంజూరు చేయించానని ఎమ్మెల్యే పార్థసారథి పదేపదే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.4 కోట్లు ఏ పథకం కింద మంజూరు చేయించారు, ఆ నిధులతో ఏయే పనులు చేయించారో పూర్తి వివరాలను తెలియజేయాలని కోరారు. వివిధ పథకాల కింద మంజూరైన నిధులను తామే మంజూరు చేయించినట్లుగా కూటమి నేతలు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు.

ఆశకు పోయి భంగపడుతున్న కౌన్సిలర్లు..

2017లో మంత్రాలయం, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలుగా ఉన్న కొనసాగిన సమయంలో టీడీపీ తమకు ప్రలోభాలకు గురి చేసిందని, అయితే తాము తలొగ్గలేదని మాజీ ఎమ్మెల్యే సాయి అన్నారు. పేదలు ఇచ్చిన పదవిని అమ్ముకుని వారిని అగౌరవపరచలేదన్నారు. అయితే నేడు కొంతమంది కౌన్సిలర్లు ఆశకు పోయి భంగపడుతున్నారన్నారు. తాము ప్రజల పక్షానే నిలుస్తామని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ పరమావధిగా పనిచేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం హయాంలో జరిగినన్ని భూకబ్జాలు ఎప్పుడూ జరగలేదని వారు చెప్పారు. రేషన్‌కార్డుల మార్పు, బతికినా చనిపోయినట్లుగా రికార్డుల్లో సృష్టించి భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆదోని అభివృద్ధి

ఆదోనిలో అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగిందని, ఎన్నికల ముందు ఎమ్మెల్యే పార్థసారథి ఆదోని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, లోకేశ్వరి, పార్టీ శ్రేణులు నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఇబ్రహీం, వాసీం, రాజేశ్వరరెడ్డి, ఖలీల్‌అహ్మద్, నాగరాజ్, వీరభద్రారెడ్డి, మాధవరెడ్డి, రామలింగేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు శిక్షణ

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 16వ తేదీ నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 16 నుంచి 19వ తేదీ వరకు స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు.

22 లోగా ఫీజు చెల్లించండి

కౌతాళం: ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు మే 12వ తేదీ నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 22వ తేదీలోగా ఫీజు చెల్లించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒక సబ్జెక్ట్ ఉన్న, ఎన్ని సబ్జెక్టులు ఉన్నా ఫీజు రూ.600 చెల్లించాలన్నారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు ఇంప్రూమెంట్ రాయాలను కుంటే సబ్జెక్ట్ రూ.160 చెల్లించాలన్నారు. విద్యార్థులకు కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు ఎస్ఐ హనుమంత రెడ్డి తెలిపారు. మంగళవారం డి.బెళగల్ గ్రామంలో పోలీసులతో కలిసి దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన బింగి వెంకటేశుతో పాటు మరో ఇద్దరు అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 240 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద మట్కా చీటీలు స్వాధీనం చేసుకొని రూ.11,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి బింగి వెంకటేశును రిమాండ్ తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.


ముగిసిన వేలం పాట

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం కర్నూలు ఎక్సైజ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ వేలం పాటలు నిర్వహించారు. 28 వాహనాలకు వేలం పాటలు జరుగగా పాటదారులు 26 వాహనాలను దక్కించుకున్నారన్నారు. వేలం పాట ద్వారా మొత్తం కలిపి రూ.2,20,188 ఆదాయం వచ్చింది.

వనజీవి జానకిరామయ్యకు చిత్ర నివాళి

ఎమ్మిగనూరుటౌన్: తన జీవిత కాలంలో కొన్ని లక్షల మొక్కలు నాటిన వృక్ష ప్రేమికుడు, వనజీవి డాక్టర్ ధరిసెల్లి జానకిరామయ్య మృతి పట్ల పట్టణానికి చెందిన కనకవీడు హైస్కూల్ ఉపాధ్యాయుడు కాకే వెంకటేశప్ప మంగళవారం చిత్రం గీసి నివాళులర్పించారు. వసుధకు అనంత వృక్షమాలతో నవప్రాణ వాయువులూది భావి జీవితాన్ని హరితవనం చేసిన విశ్వచైతన్య మూర్తి అని, ఎందరికో ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని ఈ కార్టున్‌లో తెలియజేశారు.

ఉపాధ్యాయుడు కాకే వెంకటేశప్ప గీసిన కార్టున్



చోరీ కేసులో ఆభరణాల రికవరీ



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: గత నెల 28వ తేదీన వెంకన్నపేటలో లక్ష్మిశ్వేత ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆభరణాలను రికవరీ చేశారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ హేమలత నిందితుడు వడ్డే రవికుమార్‌ను, అతని వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు చైన్, నల్లపూసల దండ, తాళిబొట్టును మీడియాకు చూపించి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని వడ్డేగేరికి చెందిన రవికుమార్ గత నెల 28వ తేదీన వెంకన్నపేటలో లక్ష్మిశ్వేత ఇంట్లో చొరబడి ఆమె మెడపై కత్తి పెట్టి బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని వెళ్లాడని తెలిపారు. లక్ష్మిశ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయి రవికుమార్‌ను ఈనెల 14వ తేదీన రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకొని, అతని వద్ద బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా అనుమానితుడిగా రవికుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. సదరు వ్యక్తి వద్ద చోరీ చేసిన మొత్తం ఆభరణాలు ఉన్నాయని, మొట్టమొదటిసారిగా ఈ దొంగతనం చేశాడని, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఈ దొంగతనం చేసినట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిని పట్టుకున్న టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, ఆంజనేయులు, సురేష్, రామాంజనేయులను డీఎస్పీ అభినందించారు. వేసవి సెలవులు దగ్గరలో ఉన్నాయని, సెలవుల్లో ఊరెళితే తమ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్నమున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వార్డు సచివాలయ సిబ్బంది, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో చెత్త సేకరణలో పారిశుధ్య సిబ్బంది తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ముందస్తు ఆస్తి పన్ను వసూలుపై సమీక్షించారు. సమావేశాల్లో ఆర్ఓ అస్లాంబాషా, మున్సిపల్ డీఈ రాజునాయక్, ఏఈ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడికల్ చెరువు పరిశీలన

పట్టణానికి నీటి సరఫరా చేసే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు నీటిని మళ్లించే ఎల్లెల్సీ కాలువా, గుడికల్ చెరువును మంగళవారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు.ఎల్లెల్సీకి నీటి సరఫరా నిలిచిపోయినందున గుడికల్ చెరువులో నీటి నిల్వకై ఏర్పాటు చేసిన క్రాస్ బండ్‌ను పరిశీలించి నీటి సరఫరాపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణంలోని పార్క్‌రోడ్, షరాఫ్ బజార్, కొండవీటి ప్రాంతాల్లో ఆయన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఎప్పటి చెత్తను అప్పుడే డంప్‌యార్డ్‌కు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు.